ఇందలి రెండు కావ్యములను ఏకముగ తొలిసారి ఆంధ్రమహాజనులకు అందీయగలుగుచున్నందులకు ఆమోదితులమగుచున్నాము. ఈ రెండును విడివిడిగా ప్రకటితపూర్వములే. అయితే అందు 'ముద్దు' మునుపు కవిమిత్రులకేకాని పాఠకలోకమునకు అందనిది. ఇక 'పాపాయి' కొంతమాత్రమే గ్రంథరూపమున వెలసినది. కొరవ భారతిపత్రిక మాససంచికలలో మసలుచుండినది. ఇపు డీగ్రంథ ప్రచురణముతో 'ముద్దు' సర్వజనులకును, 'పాపాయి' సమగ్రముగను ఉపలబ్ధమగుచున్నది.

వీని రచయిత - ఆంధ్రదేశమునందలి సుప్రసిద్ధవైశ్యకుటుంబములలో వీనుమిగిలిన నాళము వంశీయులు. కృష్ణరాయాభిధానులు. తన మధురసలిలములను ఒక్కసారి తాగిన వారిని సయితము మధురకవులనుగా మార్చు గోదావరీనదీతీరమున నిరంతరము నివశించువారు. ఆంధ్రదేశపు ఆక్స్ఫర్డు అయిన రాజమండ్రి పౌరప్రముఖులలో నొకరు. గ్రంథాలయోద్యమదీక్షితులు.

ఆధునికాంధ్ర కవులలో మాన్యతగడించిన వారిలో నాళము కృష్ణారావుగా రొకరు. సికిందరబాదు కవిపండితసభలో ప్రశస్తసాహిత్యులయిన రాయప్రోలు సుబ్బారావుగారి అధ్యక్షతను శ్రీవారికి మధురకవి బిరుద మీయబడినది. వారు రచియించిన 'గోగీతము,' 'పాలతరగలు' మున్నగు కావ్యములు వారి కవితామాధుర్యమును ఆంధ్రులకు రుచిచూపియున్నవి.

'ముద్దు' కావ్యమున అద్భుతములో ఆమోదమాధుర్యమును— 'పాపాయి' కావ్యమున విషాదములో సానుతాపమాధుర్యమును చక్కగను, చిక్కగను చూపి ఈమధురకవి తనరచనమున 'మధురించు' కొనెను.

మాగ్రంథపరంపరలో ఈఉత్తమ మధుర గ్రంథము ప్రచురించుట కవకాశము కల్పించిన మామిత్రులు శ్రీనాళము కృష్ణారావుగారికి మాధన్యవాదము లర్పించుకొనుచు విరమించుచున్నాము.

—ప్రకాశకులు.

వానిపేర బరాతంబు వ్రాయుకొఱకు
ముందు చెక్కుపై నంటించు ముద్ర సుమ్ము
చుఱుకువలపుల ఘాటెక్కి చుఱ్ఱు మనఁగ
బడలికలు వాప జుఱ్ఱెడి పానకంబు
అహాహా! ముద్దు బోలిన వింత మహిని గలదె?
ముద్దుపెట్టుట కిన్నని హద్దు లేదు
ఎన్నిముద్దులు పెట్టిన నేమి కొఱత?
ఒకటి—యిరువుర దేహంబు లొకటి చేయు
రెండు—మెండుగ పులకల నిండఁ జేయు
మూడు—పరవశంబునకనుల్ మూయఁజేయు
నూరు పెట్టిన తఱుఁగునే యూరుఁ గాని
వేయి యైనను వేయేల, విసుగు లేదు
ముద్దు బోలిన ముచ్చట పుడమి గలదె?

* * *

ఇంతసే పని దానికి తంతు లేదు
ఎంతసే పైన దానికి వింత లేదు
చిటికలోపల నొకటి రచింపవచ్చు
నిముసమున కొక్కశతకంబు నింపవచ్చు
గడియ కొక్క సహస్రంబు నిడగవచ్చు
అహాహా! ముద్దు బోలినవింత మహిని గలదె?

* * *

ముద్దు గొనుటకు నొకప్రొద్దు హద్దు లేదు
ముద్దు గొనుటకు వలయునే మూరుతములు
పగలు రేయియు నొకతీరె వాట మగును

పట్టుపగ లైన నొక్కింత గుట్టు పెడదు
నిట్టనిసి యంచు దానికి మట్టు లేదు
మించి మూడుప్రొద్దులును సేవించవచ్చు
ముద్దు బోలిన ముచ్చట పుడమిఁ గలదె?

* * *

ముద్దులాడఁగ నొకచోటు హద్దు లేదు
కడఁగి యేగంగ సాంకేతికములు లేవు
అన్నిచోటులు వాటమై యనువుపడును
బట్టబయ లైన దానికి రట్టు లేదు
మఱుఁగుచో టని చాటును మాటు లేదు
మాసుఁగులో గ్రుద్దులా టేల ముద్దులాడ?
అహాహా! ముద్దు బోలినవింత మహిని గలదె?

* * *

అవయవంబుల నన్నింటియందు నరయ
నేది ముద్దుకు గుఱి యంచు నెంచ నేల?
నుదురు కన్నులు నాసిక పెదవి చెక్కు-
గడ్డ మఱితయు చేయి వక్షంబు బొడ్డు
ఇదియు నది యని తడవంగ నేల యింక?
ఆత్మ కింపైనవారల యంగకముల
నోల నాపాదమస్తక మొక్కటె రుచి
ముద్దు బోలిన ముచ్చట పుడమిఁ గలదె?

* * *

వయసుతోడను దానికి నియతి లేదు
బిడ్డ డైనను దాని కసడ్డ గొనఁడు

వృద్ధుఁడైనను దానికి సిద్ధపడును
శిశులు బాలలు జవ్వనుల్ ముసలివారు
ఓలి నాబాలగోపాల మొక్కరీతి
ముద్దుగొనుటకు నర్హత బూనియుందు
రహాహా! ముద్దు బోలినవింత మహిని గలదె?
వావివరుసలఁ బాటింప పనియె లేదు
అక్క తమ్మునైనను, తమ్ముఁ డక్కనైన
అన్న చెల్లెలైనను, చెల్లె లన్నయైన
తల్లి సుతు నైన, తనయుండు తల్లి నైన
తండ్రి సుత నైన, కూతురు తండ్రి నైన
ముద్దులాడఁగవచ్చు మోమోట లేక.
ముద్దు బోలిన ముచ్చట పుడమిఁ గలదె?

* * *

లింగభేద వివక్షయు లేదు దీన
స్త్రీని స్త్రీ, మగని మగడు, శిశువు శిశువు
గూడి యొండొరులను ముద్దులాడవచ్చు.
వారు వీ రని వరుసయు వంతు లేదు
వారు వీరిని వారిని వీరు చేరి
యొక్కసారియె యిరువురు నొకరి నొకరు
ముద్దు లాడంగవచ్చును ముదము మీఱ.
అహాహా! ముద్దుబోలినవింత మహిని గలదె?
వింతగా నేర్వ నిది బ్రహ్మవిద్య కాదు
సాధకము చేసి సాధింప సాము కాదు
నిష్ఠతో నభ్యసింపంగ నియతి లేదు

లోకమును మాయ మాత కలుగును గాని
ముద్దు మాయంగ నెచ్చోట మాత లేదు
ముద్దు మన్మథాచార్యుని ముద్ర గాన
చెక్కు తప్పిన మోవిపై నెక్కు సుమ్మి.
అహాహా! ముద్దు బోలిన వింత మహినిగలదె!
నవ్వు నాల్గువిధంబుల నష్టకారి
ముద్దు మూడువిధంబుల మోదకారి
గుద్దులాడిన నిలువదు గిద్దె డైన
ముద్దులాడిన నిలుచును ముద్దినుసులు
ఎద్దు లేకుండ బండియు నేగు గాని
ముద్దు లేకుండ సంసారములు నడచునె!
చద్ది లేకుండ నొకపూట జరుపవచ్చు
ముద్దు లేకుండ నొకప్రొద్దు పుచ్చనగునె
ముద్దు బోలిన ముచ్చట పుడమి గలదె!

* * *

ముద్దుగొనుటకు పద్ధతుల్ మూడు కలవు
మోవి చెక్కున గదియించి ముద్దుగొనుట
చేరి శిరమును నివురుచు మూర్కొనుట
మూడుముని వ్రేళ్ళ చిబుకంబు పుణికిపుచ్చి
మోవిపై వ్రేళ్లు గీలించి ముద్దుగొనుట.
అహాహా! ముద్దు బోలిన వింత మహిని గలదె!
ముద్దునకును ప్రతిక్రియ ముద్దె సుమ్మి
వ్రాత వ్రాతనె బలి గోరురీతి గాఁగ
ముద్దు ముద్దునె బలి గోరు సోద్దెముగను

మాటకును మాట తెగు లను మాటి గాఁగ
ముద్దునకు ముద్దు తెగు లను సుద్ది నిజము
ముద్దర మఱొక్క ముద్రను గుద్దినట్లు
ముద్దు వేఱొకముద్దును గుద్దు సుమ్ము

* * *

ఆరవంబున ప్రతిరవ మమరినట్లు
బీజమందున బీజంబు వెలసినట్లు
అద్దమందు ప్రతిఫలించు నద్దమట్లు
ముద్దులోపల వేఱొకముద్దు నిలుచు
దీపమున దీప ముదయించుతీరు గాఁగ
ముద్దు వేఱొక్కముద్దున పొడముఁ జువ్వె
అహాహా! ముద్దు బోలిన వింత మహిమ గలదె?

* * *

ముద్దు వివిధరసంబుల ముద్ద తలఁప
మోవి త్రిప్పుచుఁ బెనఁగెడి ముగుదతనము
జంక కెదురొత్తు లిచ్చెడు జాణతనము
మాటి కానలు వొడిచెడు మంకుతనము
లోగి యువ్విళులూరెడి లోలతనము
కొసరి పైయాటలకుఁజొచ్చు కొంటెతనము
ఉబ్బి తబ్బిబు వడియెడు గబ్బితనము
బాళి మోవిని నందిచ్చు బేలతనము
పూని చేతకుఁ బ్రతిసేయు ప్రోడతనము
అలిగి మూడంకె వేయు గయాళితనము
కులికి కన్నులు మూసెడు గోలతనము

ముద్దు తోడి సమం బగు విద్దె కద్దె
ముద్దుతోడను తులతూఁగు బుద్ధి కద్దె
ముద్దుతోడను సరివచ్చు పద్దు కద్దె
ముద్దుతోడను సాటియౌ సుద్ది కద్దె
ముద్దుతోడను దీటగు సుద్ది కద్దె?
ముద్దు సకలసౌఖ్యానంద పూరితంబు
ముద్దు మూఁహలోకంబుల మొదటిటెంకి
ముద్దు సర్వభూతంబుల మూలదుంప
ముద్దు మూఁడుమూర్తులకును మూలప్రకృతి
ముద్దు లేకున్న జగములు పుట్టఁ గలవె
భువిని ముద్దను వస్తువే పుట్టకున్న
తుంటవిల్తుఁడు చూపించు తోంటచేయి
బమ్మదేవుఁడు సృష్టికి బొమ్మవెట్టు.

* * *

జీవు లన్యోన్యసాహాయ్య శ్రీ వహించి
ఐకమత్యమున మెలంగునట్లు చేయు
ముఖ్యసాధన మరయంగ ముద్దె కాన
అట్టిముద్దు లేకున్నచో నఖిలజనులు
సహన బుద్ధిని వీడి మత్సరము బూని
ఆగ్రహమున నా జింగల హంబు లాడ
జగము లల్లకల్లోలమై సమయుఁ గాదె?
అణువులొండొంటిసంయోగమునను గూడు
మూలశక్తివిచారింప ముద్దె కాన,
గ్రహగణంబు పరస్పరాకర్షణమున

పలికి, రవ్వయు నిన్ను గాపాడ వయ్యె ;
నాదుదౌర్భాగ్యఫల మది కాదె యకట !

ఎచట నేగుడి నే దేవుఁ డెదురుపడిన,
'అయ్య రాకుండ నను గావు మయ్య' యంచు
మ్రొక్కుచుందువు, వారిలో నొక్కఁ డైన
అడ్డుపడి నిన్ను గాపాడఁ డయ్యె నయ్యొ !

ఏను మును నీకు ప్రతిమ తీయించినపుడు,
చూపు మింటికిఁ బఱపి కూర్చుండినావు ;
మింటిచూపులె కాని, యీమంటిచూపు
తిరము కా దని యాలీలఁ దెలిపినావ ?

మృత్యుసమయంబు దాపింప మేను మఱచి
'ఇంటి కేగుచున్నాఁడ' నంటి వయ్య !
కలవరింపని యప్పుడు తలఁచికొంటి
అకట ! యిప్పుడు తెలియంగ నయ్యె నిజము.

పలకపై నేవో యక్షరంబుల రచించి
'అయ్య ! నావ్రాత యిదె పూర్తి యయ్యె' నంచు
పలికితివి రేపు రోగంబు వచ్చు ననఁగ ;
అకట ! ఆమాట సత్యంబ యగుచుఁ దాఁకె.

" పిలువ రెప్పుడు నోరార పేరు పెట్టి,
' పాప' యని పిల్తు రది యేమిపాప మొక్కొ ?

